క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అల్పాహారం అందజేత



తెనాలిటౌన్: నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో వృద్ధులకు శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకుడు కిషోర్ గురూజీ శనివారం అల్పాహారం అందజేశారు. నిష్కామకర్మ యోగంలో భాగంగా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సీనియర్ యోగ సభ్యులు వెంకటేశ్వరగుప్తా స్వామిజీ సహకారంతో అల్పాహారం అందజేశామని తెలిపారు. ముంతా శ్రీనివాసరావు, తాడికొండ శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, సీహెచ్ నాగేశ్వరరావు, రాంబాబు, టీవీ సుబ్బారావు, కోమల మాతాజీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు ప్రారంభం



కొల్లిపర: మండల పరిధిలోనే రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం మొక్కజొన్న పంట కొనుగోలు ప్రారంభించినట్లు తెనాలి ఏడీఏ వెంకటరావు తెలిపారు. కొల్లిపర గ్రామంలో శనివారం 200 క్వింటాళ్ల మొక్కజొన్నను కనీస మద్దతు ధర క్వింటా రూ.1,962కు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు ముందుగా సంబంధిత ఆర్బీకేలో ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకొని, అధికారులు తెలిపిన విధంగా.. సమయానికి మొక్కజొన్నను కేంద్రాలకు తీసుకురావాలని చెప్పారు. 10 నుంచి 15 రోజుల లోపే.. మొక్కజొన్న డబ్బులు రైతు ఖాతాలో జమ అవుతున్నట్లు తెలిపారు.

నేడు విజయవాడలో ప్రజా చైతన్య సభ

తెనాలి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులోనే జరగాలనే ప్రజా చైతన్య కార్యక్రమాలను తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏడాది పాటు నిర్వహించనున్నట్లు సమాఖ్య తెనాలి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు శనివారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాచైతన్య ప్రారంభ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాసన సభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు, ఎంబీ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు పి.మధు, సమాఖ్య కార్యదర్శివర్గ సభ్యుడు డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ ప్రసంగిస్తారని తెలిపారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు, అధ్యక్షుడు గారపాటి ఉమా మహేశ్వరరావు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. న్యాయస్థానాల తీర్పులతో సహా అన్ని పనులు తెలుగు భాషలో జరగాలని, ప్రజలు, ప్రభుత్వంలో చైతన్యాన్ని పెంచేందుకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

మజ్జిగ పంపిణీ

తెనాలిరూరల్: తెనాలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సాయిబాబా గుడి వద్ద ఏపీ నవ చైతన్య బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది ఎస్‌బీ శివ ముఖ్య అతిథిగా పాల్గొని, మజ్జిగ అందజేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడిబోయిన గంగయాదవ్, గౌరవ సలహాదారు కందుల సాంబశివరావు గౌడ్, పి.యలమంద, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

తెనాలిరూరల్: మోరిస్ పేట ఆర్‌ఆర్‌నగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో 3 నుంచి 9వ తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపల్ కె.శిరోమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 63048 08991, 94910 61138 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వైకుంఠపురంలో వేడుకగా బ్రహ్మోత్సవాలు



తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం భరత నాట్యం, సాయంత్రం అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన ఆకట్టుకున్నాయని ఈఓ ఎం.తిమ్మానాయుడు తెలిపారు.

గెలుపు కోసమే ఆడాలి

- ఓడిపోతే క్రీడాస్ఫూర్తి అనుకుని సరిపెట్టుకోరాదు
- అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత మొవ్వా శ్యాంసుందరరావు



ఆటగాళ్లతో శ్యాంసుందరరావు

తెనాలి: క్రీడాకారులు గెలుపు కోసమే ఆడాలి...ఓడిపోయినా పర్వాలేదు...క్రీడాస్ఫూర్తి అనుకుని సరిపెట్టుకోరాదని ఒకప్పటి ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు, కోచ్ మొవ్వా శ్యాంసుందరరావు స్పష్టం చేశారు. గొప్ప క్రీడాకారులు ప్రాక్టీస్ గేమ్‌లో ఓటమిని సైతం జీర్ణించుకోలేరని తెలిపారు. తెనాలికి చెందిన శ్యాంసుందరరావు వాలీబాల్ క్రీడలో ఉన్నత శిఖరాల్ని అందుకున్నారు. క్రీడాకారులు, శిక్షకులకు బహూకరించే అర్జున, ద్రోణాచార్య అవార్డుల్ని భారత ప్రభుత్వం నుంచి స్వీకరించారు. మిలటరీ, రైల్వేలో పని చేశారు. స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌గా 2001లో రిటైరయ్యారు. 2007–11లో జాతీయ కోచ్‌గా పని చేశారు. స్వస్థలం తెనాలి సమీపంలోని జంపని. ప్రస్తుతం హైదరాబాద్‌లో విశ్రాంత జీవితం గడుపుతున్న ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం తెనాలి వచ్చారు. సాయంత్రం స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియానికి వచ్చారు. ఇన్‌చార్జి, వాలీబాల్ కోచ్ కాకర్ల కోటేశ్వరరావు నేతృత్వంలో స్టేడియంలో వాలీబాల్ ఆటగాళ్ల సాధనను తిలకించారు. ఇదే స్టేడియంలో సాధన ఆరంభించి జూనియర్ నేషనల్స్, యూనివర్శిటీ స్థాయిలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్ని అభినందించారు. కాంబినేషన్‌తో కూడిన వాలీబాల్ ఆటలో ఏకాగ్రత, పట్టుదలతో సాధన చేసినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలరని సూచించారు. నిబద్ధతతో కూడిన సాధన చేసినపుడే మంచి క్రీడాకారులు కాగలగరని చెప్పారు. ఓటమిని తేలికగా తీసుకోరాదని, ఎక్కడ లోపం జరిగిందో సమీక్షించుకుని, పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. సాధన తర్వాత కూడా ఖాళీ సమయంలోనూ మెంటల్ రిహార్సల్స్ చేసుకోవడం అదనపు ప్రాక్టీస్ అవుతుందని చెప్పారు. ఓటమి చెందినపుడు జట్టులో తప్పొప్పుల్ని సానుకూల దృక్పథంతో చర్చించుకోవాలి మినహా కారకుల్ని వేలెత్తి చూపడం తగదన్నారు. గతంలో కోచ్‌లంటూ ప్రత్యేకంగా ఉండేవారు కాదని గుర్తుచేశారు. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆసక్తితోనే క్రీడలకు ప్రోత్సాహం లభించి, మంచి క్రీడాకారులు వచ్చారని సోదాహరణంగా చెప్పారు. తొలుత స్టేడియానికి వచ్చిన శ్యాంసుందరరావుకు కోచ్ కాకర్ల కోటేశ్వరరావు, వాలీబాల్ క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు.

వైభవంగా హనుమంతుని శోభాయాత్ర



శోభాయాత్రలో రథంపై ఆంజనేయస్వామి



1,108 అరటి పళ్లతో స్వామి అలంకరణ

తెనాలిటౌన్: పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని పుర వీధుల్లో శనివారం స్వామివారి శోభాయాత్రను నిర్వహించారు. జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ భక్తులు ఆంజనేయుని జెండాను పట్టుకుని యాత్రలో పాల్గొన్నారు. ఆలయం నుంచి మెయిన్ రోడ్డు, గాంధీచౌక్, బోసు రోడ్డు, షరాఫ్ బజార్‌ల మీదుగా శోభాయాత్ర తిరిగి ఆలయానికి చేరుకుంది. మేళతాళాలు, భక్తి కీర్తనలతో సందడిగా సాగిన శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడారు. ఆదివారం నుంచి 24 వరకు జరిగే వార్షిక హనుమజ్జయంతి, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఎస్‌బీ శివ, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, సంకీర్తనా బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, మూర్తి వెంకటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

– గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో దాసాంజనేయస్వామి చతుర్దశ వార్షిక జయంతి మహోత్సవాలు బాలస్వామిజీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. శనివారం స్వామివారికి 1,108 అరటిపళ్లతో ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు జరిపారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మఠం సభ్యులు పాల్గొన్నారు.

– నాజర్‌పేటలోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకం జరిపి, అరటి పళ్లతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కె.లోకనాథశర్మ, సెక్రటరీ ఎస్.వెంకటేశ్వరరావు, వారంశెట్టి లక్ష్మీ సీతారామారావు, ప్రధాన అర్చకుడు వై.వెంకటనరసరాజు శర్మ, భక్తులు పాల్గొన్నారు.

పొలాలను సందర్శించిన జనసేన నేత నాదెండ్ల



జొన్న పంటను పరిశీలిస్తున్న మనోహర్

తెనాలిరూరల్: తెనాలి పట్టణ పరిధిలోని ఐతానగర్ శివారు గోలిడొంకలో జనసేన నేత నాదెండ్ల మనోహర్ శనివారం పర్యటించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కల్లాల్లో ఆరబెట్టుకున్న జొన్న, మొక్కజొన్నను పరిశీలించి, నష్టం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, వర్షాలతో చేతికి అందివచ్చిన పంట నష్టపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వారిని పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. అకాల వర్షాలకు నాలుగు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం గాఢ నిద్ర వీడటం లేదన్నారు. రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక పొత్తుల విషయంలో రాష్ట్రానికి మేలు జరిగే విధంగా ముందుకు వెళ్తామని మనోహర్ తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ కల్యాణ్ ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బండారు రవికాంత్, ఇస్మాయిల్ బేగ్, తోటకూర వెంకట రమణారావు, పసుపులేటి మురళీకృష్ణ, దివ్వెల మధుబాబు, వెంకయ్య నాయుడు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ బహూకరణ



సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

ప్రత్తిపాడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ దివ్యాంగుడు విన్నవించుకున్న సమస్యకు స్థానిక ఎమ్మెల్యే పరిష్కారం చూపారు. మండల పరిధిలోని కొండేపాడులో కొద్దిరోజుల కిందట ఎమ్మెల్యే సుచరిత గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన సందర్భంలో గ్రామానికి చెందిన దివ్యాంగుడు వలివేరు మరియదాసు ట్రై సైకిల్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నానని, ఇప్పించాలని సుచరితకు విన్నవించారు. స్పందించిన ఆమె శనివారం గుంటూరులోని తన కార్యాలయంలో మరియదాసుకు ట్రైసైకిల్‌ను అందించారు. దీంతో మరియదాసు సుచరితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

379 కేసుల పరిష్కారం



తెనాలి రూరల్: తెనాలి కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 379 కేసులు పరిష్కారమయ్యాయి. వివిధ కేసులకు సంబంధించి జరిమానా/అపరాధ రుసుం కింద రూ.2.24 కోట్లు కట్టించారు. 36 సివిల్, 331 క్రిమినల్, 12 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరమయ్యాయి. సమావేశానికి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి అధ్యక్షత వహించారు. న్యాయమూర్తులు వై.బెన్నయ్యనాయుడు, రాజశేఖర్, జె.శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, న్యాయ శాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బాపట్లలో 335 కేసులు..

బాపట్ల: బాపట్లలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 335 కేసులు శనివారం పరిష్కారమయ్యాయని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాధుబాబు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా 335 కేసులకు గాను రూ.73.05లక్షల లావాదేవీలు జరిగాయని చెప్పారు. న్యాయమూర్తులు కె.సీతారామకృష్ణారావు, జి.వాణి, ఎం.సత్యకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లీలాకృష్ణ, న్యాయవాదులు బండి రామమూర్తి, బి.కమల్ కుమార్, వై.ఉషారాణి తదితరులు ఉన్నారు.

సత్వర న్యాయం లోక్ అదాలత్ లక్ష్యం

తాడేపల్లిరూరల్: సత్వర న్యాయం లోక్ అదాలత్ లక్ష్యమని మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజు అన్నారు. మంగళగిరి కోర్టు పరిధిలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ మాట్లాడుతూ మూడు నెలలకొకసారి నిర్వహించే లోక్ అదాలత్‌లు కక్షిదారులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులు రాజీ చేసుకోవాలని చెప్పారు. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఒకటైమ్ సెటిల్‌మెంట్ కేసులను పరిష్కరించారు. శనివారం 1241 కేసులు పరిష్కారమయ్యాయి.

జూదరుల అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నులకపేటలో పేకాటాడుతున్న ఆరుగురిని శనివారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. నులకపేట మసీదు రోడ్డు చివర ముళ్లపొదల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు చెప్పారు. ఆరుగురు ఆటో డ్రైవర్లు పేకాట ఆడుతూ కనిపించారని, వీరి నుంచి రూ.3500 స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిటౌన్: నాజరుపేటలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కర పత్రాలను ఆలయ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. 14న వీరాంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం. 18న లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిరందాసు విజయకుమారి, ఎం.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

16న యూటీఎఫ్ ఉద్యమ తరగతులు



మాట్లాడుతున్న ఎం.కళాధర్

తెనాలి: విద్యారంగ పరిణామాలపై ఈ నెల 16న తెనాలిలోని పెన్షనర్స్ హోంలో జరగనున్న ఉద్యమ తరగతులను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ పేర్కొన్నారు. శనివారం సంఘ కార్యాలయంలో జరిగిన తెనాలి ప్రాంతీయ శాఖల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ఉద్యమ తరగతుల్లో సందేశం ఇస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు ప్రభుత్వ విధానాలపై మాట్లాడారు. జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి దేల, జిల్లా కార్యదర్శులు కె.సాంబశివరావు, ఆదినారాయణ, కె.రంగారావు, షేక్ అహ్మద్ హుస్సేన్, రామకృష్ణ పాల్గొన్నారు.

మృదంగ విద్వాంసుడు రామకృష్ణకు సత్కారం



కానూరి రామకృష్ణకు సత్కారం

తెనాలి: పట్టణంలో జరుగుతున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఎన్టీఆర్ వ్యక్తిత్వం, నటించిన సినిమాలపై చర్చా వేదిక నిర్వహించారు. పొన్నూరు వెంకట శ్రీనివాసులు, షేక్ అస్మతున్నీసా సినిమాల్లో అన్నగా ఎన్టీఆర్ అనే అంశంపై మాట్లాడారు. వక్తలతో పాటు ప్రముఖ ఏ–గ్రేడ్ మృదంగ విద్వాంసుడు, కంచి కామకోటి ఆస్థాన విద్వాంసుడు కానూరి వెంకట రామకృష్ణను సత్కరించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, బెల్లంకొండ వెంకట్, ఆళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైలులో మద్యం అక్రమ రవాణా



తాడేపల్లిరూరల్: తాడేపల్లి కృష్ణాకెనాల్ రైల్వే జంక్షన్ పరిధిలో మధ్యప్రదేశ్ నుంచి రైలులో తీసుకువచ్చిన మద్యాన్ని దింపి మంగళగిరి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మంగళగిరి ఎస్‌ఈబీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని శనివారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మారయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లో మద్యం కొనుగోలు చేసి అవి కనిపించకుండా ప్యాకింగ్ చేసి ట్రైన్‌లో భారీగా మద్యం తరలిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు మంగళగిరి ఎస్‌ఈబీ కార్యాలయం ఆధ్వర్యంలో తాడేపల్లి కృష్ణా కెనాల్ వద్ద నిఘా ఏర్పాటు చేశామని, శనివారం తెల్లవారు జామున మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ట్రైన్ ట్రాక్ మారేందుకు స్టేషన్ శివారులో స్లో అవడంతో రైలులో నుంచి తెలంగాణా రాష్ట్రం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం, నక్కలగుట్ట తండాకు చెందిన ధరావత్ శ్రీకాంత్ మద్యం బాటిళ్లు కలిగిన మూడు మూటలను కింద పడవేశాడు. అనంతరం అతను కూడా కిందకి దిగాడు. మంగళగిరికి చెందిన తెనాలి విజయ్ కుమార్‌తో కలసి తీసుకువచ్చి ఆ మద్యం సీసాలను మోసుకువస్తూ ఉండగా వారిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద 180 మి.లీ. ఆఫీసర్స్ చాయిస్ 432 ప్లాస్టిక్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

జొన్న పంట కొనుగోలు వేగవంతం చేయండి

తెనాలి ఇంచార్జి సబ్ కలెక్టర్ శివన్నారాయణశర్మ



వడ్లమూడిలో తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న శివన్నారాయణశర్మ తదితరులు

చేబ్రోలు: కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు పక్రియను వేగవంతం చేయాలని తెనాలి ఇంచార్జి సబ్ కలెక్టర్ శివన్నారాయణశర్మ సిబ్బందిని ఆదేశించారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో శనివారం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పంటల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 33 శాతం కన్నా ఎక్కువ దెబ్బతిన్న పంటల జాబితా, వర్షాలకు పంట దెబ్బతిన్న రైతుల జాబితాను వెంటనే అందజేయాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ఏవో బి. శ్రీనివాసనాయక్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రంలో గోవులకు సకల సదుపాయాలు



వెంగళాయపాలెం గో సంరక్షణ కేంద్రంలో పర్యటిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వెంగళాయపాలెంలోని సంరక్షణ కేంద్రంలో గోవులకు సకల సదుపాయాల్ని కల్పించినట్లు మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు తెలిపారు. గో సంరక్షణ సేవా దళ్ సమితి సభ్యులతో కలసి శనివారం కేంద్రాన్ని పరిశీలించారు. ఆవుల సంఖ్య, సంరక్షణ, సిబ్బంది గురించి అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆవులకు సకాలంలో ఆహారం, నీరు అందించాలని సిబ్బందికి చెప్పారు. కేంద్రంలో తాగునీటి సౌకర్యం, మేత వేయడానికి తొట్టెలు, వర్షాలకు తడవకుండా మరో పాకతో పాటు లైట్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. వారానికి రెండు రోజులు పశు వైద్యులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, గో సంరక్షణ సేవా దళ్ సమితి సభ్యులు భజరంగ్ రామకృష్ణ, పెద్దింటి కృష్ణ చైతన్య, ప్రదీప్ కుమార్ జైన్, సురేష్ కుమార్ జైన్, నిఖిల్ జైన్, రాజు పూర్వాల్, దినేష్ సాంఘి, వీరయ్య చౌదరి, నరసింహమూర్తి, అంకాల శ్రీనివాస్, వంగ నవీన్‌రెడ్డి డీఈఈ రమేష్, ఏఈ నాగవేణి, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు కృషి



తాడేపల్లిరూరల్: దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ, రూరల్ కమిటీ విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ బీజేపీ ప్రతిచిన్న విషయాన్ని అడ్డుపెట్టుకుని మతత్వాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. నీటి కుళాయిలకు మీటర్లు పెట్టడం, వ్యవసాయ బోరులకు మీటర్లు పెట్టడం, విద్యుత్ ఛార్జీలు పెంచడం ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం విధానాలుగా పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈనెల 19న అమరజీవి పుచ్చలపల్లి సుందయ్య వర్ధంతిని వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, ఈమని అప్పారావు పాల్గొన్నారు.